క్లుప్తంగా

మాజీ సర్పంచ్ భార్య నేత్రదానం



కె. ప్రభావతి (ఫైల్)

పెదపాడు: పెదపాడు మాజీ సర్పంచ్ కాకరాల రామకృష్ణ ప్రసాద్ (బుజ్జిబాబు) భార్య ప్రభావతి (59) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసారు. కామినేని ఆసుపత్రి సిబ్బంది కార్నియాను సేకరించారు. తాను చనిపోతూ ఇతరులకు చూపు ఇవ్వాలనే ఆమె కోరికను పలువురు అభినందించారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న గొప్ప మనస్సున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అన్నారు. మంగళవారం కొవ్వలిలో లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్ నగదును వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రంగారావు, గొల్లా వీరాస్వామి, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సోమేశ్వరరావు, వలంటీర్లతో కలిసి అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



చిట్టిబోయిన రేహజ్ఞ, నవ్యశ్రీ కూచిపూడి ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారికి విశేష నవనీత (వెన్నతో) అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి (జూనియర్ ఉషశ్రీ) శ్రీమద్రామాయణ మహత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన నాట్య కళాకారిణులు చిట్టిబోయిన రేహజ్ఞ, నవ్యశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బురపరిచాయి. రాత్రి స్వర్ణ నృత్యాలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి కె.స్వర్ణలత శిష్య బృందం కూచిపూడి నాట్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు.

నేడు వక్తృత్వ పోటీలు

ఏలూరు టౌన్: విజయవాడ స్వరాజ్యమైదానంలో 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యార్థులు, యువతకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం 10గంటల్లోపు ఏలూరు కార్పొరేషన్ పీఓ కృష్ణమూర్తి వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.వెయ్యి అందజేస్తామని, మూడు విభాగాలకు వేర్వేరుగా బహుమతులు, నగరపాలక సంస్థ ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఇంటర్ లేదా పైస్థాయి విద్యార్థులకు ఆర్థిక వేత్తగా డాక్టర్ అంబేడ్కర్ అనే అంశంపైనా, విద్యార్థినులకు సామాజిక ఉద్యమకారునిగా డాక్టర్ అంబేద్రర్ అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయని వివరించారు. రెండో విభాగంలో యువకులకు అంబేడ్కర్ కుల నిర్మూలన, యువతులకు అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం అనే అంశాలపై వకృత్వ పోటీలు ఉంటాయన్నారు. మూడో విభాగంలో 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అంబేడ్కర్ ఆలోచనలు అనే అంశంపై, విద్యార్థినులకు అంబేడ్కర్ రచనలు, ముఖ్యాంశాలు అనే అంశాలపై పోటీ ఉంటుందని నగర కమిషనర్ తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్రాంతి సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ పి.శ్యామ్ సుందర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్, ఏలూరు జిల్లా కార్యదర్శి టి.ప్రేమ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించిందని తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

భీమడోలు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఎంహెచ్‌వో ఎం.నాగేశ్వరరావు అన్నారు. అంబర్‌పేటలోని సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో శిబిరాలకు తరలి వచ్చిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ముందుగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ ఏపూరి భానుదీపిక అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అదనపు డీఎంహెచ్‌వో ఎం.నాగేశ్వరరావు, ఎంపీడీవో పద్మావతి దేవి హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. శిబిరాలకు వచ్చిన దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలపై వారికి భీమడోలు సీహెచ్‌సీ సూపరింటెంటెంట్ ఎస్.సునీత వివరించారు. 374 మందికి జనరల్, ప్రత్యేక వైద్యులు, కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేసారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు: మందులను అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



పెదపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెదపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని అప్పనవీడులో ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు చేసారు. ఉన్నత వైద్యపరీక్షలు అవసరమైన వారిని జిల్లా కేంద్ర వైద్యశాలకు సిఫార్స్ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ రామసీత ఎండీవో సబ్బితి నర్సింహమూర్తి, ఎంఈఓ దేవినేని వెంకటరమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలు: అంబర్‌పేటలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ఎస్.సునీత

నారాయణపురంలో 520 మందికి వైద్యసేవలు

ఉంగుటూరు: నారాయణపురంలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగననన సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక పాఠశాల-1లో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 514 మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. ఆర్థోపెడిక్ డాక్టర్ వి.భానుప్రకాష్, డాక్టర్ ఎం.అశ్విత, చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ రెడ్డి, ఏఎన్ఎం నాగలక్ష్మి సేవలు అందజేశారు. ఎంపీటీసీ బందారు నాగరాజు, నాయకుడు బళ్ల త్రిమూర్తులు, ఉప సర్పంచి మరడ సాంబశివరావు, ఎంపీటీసీ ఆరవెల్లి మహలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, నాయకులు రామారావు, గంగాధర్ రావు, వీరాచారి, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరావు, సూరత్తుల దుర్గాధర్ పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

గణపవరం: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు, జూదాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గణపవరం ఎస్సై జి.వెంకటేశ్వరరావు అన్నారు. గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులతో కలిసి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గణపవరం సర్పంచ్ మూర అలంకారం, పంచాయతీ కార్యదర్శి శివరామ్ ప్రసాద్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

దెందులూరు: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. గంగన్నగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాల, పోతునూరు ఉన్నత పాఠశాల, గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా పాఠశాలల హెచ్ఎంలు మధుసూదనరావు, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలి

గణపవరం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ వివరించే బాధ్యత వైఎస్సార్ సేవాదళ్ కార్యకర్తలదేనని వారు బాధ్యతగా ఈపని చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యకర్తల సమావేశం ఉభయగోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని, ఈ విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కుల, వర్గ, మత, లింగ, పార్టీ బేధాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. సేవాదళ్ ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ వెంకట్రాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకుడు వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి సేవాదళ్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో పలువురు సేవాదళ్ నాయకులు మాట్లాడారు. ఈసమావేశంలో గణపవరం, ఉంగుటూరు ఎంపీపీలు ఆర్ధవరం రాము, గంటా శ్రీలక్ష్మి, మండల వైస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, నాలుగు మండలాల సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.



సేవాదళ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రామాంజనేయులు

దెందులూరు: గోపన్నపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఏనుగు రామాంజనేయులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు మంగళవారం నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు రామాంజనేయులు మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పార్టీ మాజీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, పార్టీ నాయకులు తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, పసుమర్తి శ్రీను, మోదుగుమూడి నాగలింగేశ్వరరావు, కడిమి ఆంజనేయులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయంలో కొఠారు అబ్బయ్యచౌదరిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వీరాంజనేయులను మెడలో పార్టీ కండువా వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిని వైఎస్సార్ సీపీ నాయకులంతా సత్కరించారు.



నూతన కమిటీ అధ్యక్షుడు వీరాంజనేయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, నాని

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన

భీమడోలు: రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ అన్నారు. భీమడోలు, పోలసానిపల్లిలో జన్ భగీదరిని పురస్కరించుకుని సామాజిక న్యాయ సాధికారతలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచులు పాము సునీత, షేక్ రహీమా బేగం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈనెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆవిష్కరించనున్నందున జన్ భగీదరి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. తొలుత ప్రతిజ్ఞ చేసారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ మాట్లాడుతూ విజయవాడలో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని రికార్డు స్థాయిలో పూర్తి చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. అనంతరం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, ఎంపీటీసీ అంబటి దేవి, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, సర్పంచ్ పాము సునీత తదితరులు

ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలి



సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సిఫార్సు చేయాలని ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. విజయవాడలోని సజ్జల క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వాలు తమను నిర్లక్ష్యం చేసినా డీఎస్సీ అర్హత సాధించిన 25 సంవత్సరాల అనంతరం సైతం తమకు ఉద్యోగాలు కల్పించిన సాహసవంతుడు ముఖ్యమంత్రి జగన్ అని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ అన్నారు. సీఎం సాహసోపేత నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 4600 కుటుంబాలు సంతృప్తికరంగా జీవిస్తున్నాయని వివరించారు. సజ్జలను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు కె.స్వామిదాసు, ఎ.రాజు, ఎండీ పాషా, ఎం అమరావతి, ఎం మరియమ్మ, సీహెచ్ వాహిని ప్రియ, ఎస్ శారారాణి, డి.స్వరూప రాణి, బి.శర్మ తదితరులు ఉన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారుల దాడి

భీమడోలు: భీమడోలులోని రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైయిస్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేసారు. ఆ షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, వాస్తవానికి మధ్య సరుకుల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరు రేషన్ షాపు డీలర్లు, మరో ఇద్దరు వెహికల్ డ్రైవర్లపై 6 ఏ కేసులు నమోదు చేసారు. విజిలెన్స్ సీఐ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ భీమడోలులోని కె.దుర్గాపల్లవి, ఎం.వెంకటరత్నం దుకాణాల్లో ఆకస్మిక దాడులు చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న స్టాక్‌కు భారీగా వ్యత్యాసాలను గుర్తించామన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు అందించే 3,450 కేజీల ఫోర్టిఫైడ్ రైస్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చక్కెర 19 కేజీలు, కందిపప్పు 100 కేజీలు తేడా ఉన్నాయని తేల్చారు. గ్రామంలోని వెహికల్ డ్రైవర్లు జి.విజయరత్నం, పి.నాగమహేష్‌కు చెందిన వాహనాల్లో సరుకుల్లో తేడా ఉన్నాయి. 1,150 కేజీల బియ్యం, గోధుమ పిండి 33 కేజీలు, చక్కెర 72 కేజీలు తేడా ఉన్నట్లు గుర్తించి విజిలెన్స్, సివిల్ సప్లైయిస్ అధికారులు వారి రికార్డులను సీజ్ చేసారు. ఆ నలుగురిపై 6 ఏ కేసులు నమోదు చేసారు. రేషన్ షాపుల నుంచి అక్రమంగా సరుకులు పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఏ.మాధవరావు, ఏవో కన్యకుమారి, వీఆర్వోలు సాల్మన్‌రాజు, మార్కేండేయులు పాల్గొన్నారు.



భీమడోలులో రేషన్ దుకాణంపై దాడి చేసిన విజిలెన్స్, పౌరసరఫరాల విభాగం అధికారులు

'ఆడుదాం ఆంధ్ర'తో ప్రతిభావంతులకు గుర్తింపు

భీమడోలు: క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర దోహదం చేస్తుందని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఎంపీటీసీ అంబటి దేవి అన్నారు. పోలసానిపల్లి సచివాలయం వద్ద మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన అనిల్ క్రికెట్ జట్టు క్రీడాకారులకు టీషర్ట్స్, క్రికెట్ కిట్లను వారు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి గ్రామానికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఈనెల 10 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎం.కనకదుర్గ, అయ్యప్ప, అనంతమ్మ, చెరుకూరి కమల, రాజారత్నం, ఉపసర్పంచ్ కోట శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు షేక్ హసేనా, చిలపర్తి రామారాయుడు, వీఆర్వో డి.సింహాచలం, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు, వలంటీర్లుపాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో ప్రేమాన్విత తెలిపారు. 10,11,12, 17వ తేదీన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో 250 టీములు పాల్గొంటున్నట్టు తెలిపారు. కై కరం హైస్కూలు గ్రౌండులో ఖోఖో, ఉంగుటూరు హైస్కూలు గ్రౌండులో వాలీబాల్, బాదంపూడి హైస్కూల్లో క్రికెట్టు, కబడ్డీ పోటీలు, నారాయణపురం కాలేజి గ్రౌండ్‌లో బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వివరించారు.



పోలసానిపల్లిలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఏర్పాట్లు

దెందులూరు: ఆడుదాం- ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల, కొవ్వలి ఉన్నత పాఠశాలలో ప్రారంభమవుతాయని దెందులూరు ఎంపీడీఓ ఎం.భీమరాజు తెలిపారు. క్రీడాకారులకు ఇచ్చిన దుస్తులు ధరించి విధిగా ఆటల పోటీల్లో పాల్గొన్నాలన్నారు. దెందులూరు, కొవ్వలి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తారన్నారు. అన్ని శాఖల మండల అధికారులు పోటీలను పర్యవేక్షిస్తారని ఎంపీడీఓ భీమరాజు తెలిపారు. అన్ని పాఠశాలల నుంచి మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులను, పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు బుధవారం నిర్వహించనున్న మండల స్థాయి పోటీలకు పంపాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

పెదవేగి/దెందులూరు : ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనికోసం అవసరమైన నిధులను అందిస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన హేమలత, రాణికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.15వేల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందించారు. అంకన్నగూడెంకు చెందిన 14 మంది రైతులకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకంలో అసైన్డ్ భూముల పట్టాలను ఎమ్మెల్యే అందించారు. అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మ్మడు, కవ్వగుంట సర్పంచ్ మద్దాలవాణి, నాయకులు నాగ య్య, నిమ్మల సుబ్బారావు, పామర్తి వీరయ్య పాల్గొన్నారు.



దళిత సంపూర్ణ హక్కు పథకంలో లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం

ఏలూరు(మెట్రో): ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ పాలన జరిగితేనే నిజమైన గ్రామ స్వరాజ్యమని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. విస్తరణ అధికారులకు, మండలం ప్రజా పరిషత్ పరిపాలన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి కోఆర్డినేటర్స్‌కు ఏలూరు జిల్లా పరిషత్‌లో రెండు రోజుల శిక్షణ తరగతులను జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బారావు ప్రారంభించారు. డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకత తీసుకొచ్చేందుకు, ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఈ శిక్షణ తరగతుల ద్వారా సిబ్బంది నెరవేర్చాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు శాఖలవారీగా అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు తయారిలో మహిళా భాగస్వామ్యం ఉండాలన్నారు. గ్రామీణ నీటి యాజమాన్య సంస్థకు చెందిన రాము మాట్లాడుతూ ఉపాధి గ్రామీణ హామీ పథకం అమలుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని తెలిపారు. నగదు రహిత కార్యక్రమాలు, ప్రజా ప్రణాళిక ఉద్యమ లక్ష్యాలు, ప్రణాళికల తయారీలో అధికారుల పాత్ర, పంచాయతీ ఫంక్షనల్ కమిటీల ఏర్పాటు, బాల సభ, మహిళా సభ నిర్వహణ, ఈగ్రామ స్వరాజ్యం అంశాలపై అవగాహన కల్పించారు. ట్రైనింగ్ మేనేజర్ ప్రత్యంగి రాజు, డీఎల్‌పీఓలు చంద్ర శేఖర్, రాజాఉల్లాహ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

మానవాళికి మేలు చేసేలా సైన్సు అభివృద్ధి

గణపవరం: ప్రపంచవ్యాప్తంగా మానవాళికి మేలు చేసేలా సైన్సు నిరంతరం అభివృద్ధి చెందుతోందని, దానిని ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావడం మనందరి బాధ్యత అని యుఎస్‌ఏ సీనియర్ శాస్త్రవేత్త, ఎన్ఆర్ఐ, దాత విష్ణుభొట్ల లక్ష్మన్న అన్నారు. మంగళవారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో భౌతిక శాస్త్ర విభాగం, ఎంటర్‌పెన్యూర్ క్లబ్ ఆధ్వర్యంలో సైన్సు విద్యార్థులకు గెస్ట్‌లెక్చర్ (అతిథి ఉపన్యాసం) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సైన్సుపై ఆసక్తి పెంచడానికి అధ్యాపకులు, ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. దైనందిన జీవితంలో సైన్సు ప్రాముఖ్యత, ఉపయోగాలు విద్యార్థులు గుర్తించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ 40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి, భౌతికశాస్త్ర అధ్యాపకులు గణేష్‌కుమార్, ఇన్నోవేషన్ సెంటర్ కన్వీనర్ స్వరూపరాణి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు నడిపల్లి శ్రీరామ్, స్థానిక ప్రముఖులు ఎస్.కోటేశ్వరరావు, ఎస్. శ్రీనివాసరావు, డి.సుబ్బరాజు, జి.గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.



సీనియర్ శాస్త్రవేత్త, ఎన్ఆర్ఐ లక్ష్మన్నను సత్కరించిన అధ్యాపకులు

ఆంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు హనుమాన్ జంక్షన్‌కు చెందిన గొట్టుముక్కల రవి వర్మ ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి ఆలయ హుండీలను బుధవారం ఉదయం లెక్కించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

10 మంది జూదరుల అరెస్ట్

నిడమర్రు: బావాయిపాలెం శివారులో పేకాట శిబిరంపై సోమవారం రాత్రి నిడమర్రు పోలీసులు దాడి చేసి 10 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. నిందితుల నుంచి రూ.15వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏలూరు రూరల్: దేశ ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతిలో యువత భాగస్వాములు కావాలని జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి దూలం కిషోర్ అన్నారు. మంగళవారం ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మై భారత్ వికాసిత్ 2047 అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సహజ అభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సుపరిపాలన ప్రమాణికంగా దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుందని కిషోర్ చెప్పారు. విద్యార్థులకు పలు అంశాలపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గుర్రాల దీపిక ప్రథమ, విశాల్‌కుమార్ ద్వితీయ, ప్రజ్ఞ అంబేడ్కర్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరిబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.